# 2. తిరుగుబాటు

'ఆనందం' అని వాడికి పేరు పెట్టినప్పుడు – జీవితంలో వాడు విషాదాన్ని అధికంగా అనుభవిస్తాడని వాడి తల్లిదండ్రులు అనుకొని వుండరు. వారు కనీసం దీన్ని ఊహించివున్నా- చూసేందుకు మాత్రం తీరికలేనట్టు వాడి చిన్నతనంలోనే పరలోకాల పాలయ్యారు. ఇప్పుడు వాడికి ఆత్మబంధువైనా, తల్లయినా, తండ్రయినా ఆ ముసలి బాబాయ్ ఒక్కడే!

బాబాయ్‌గారి ఇల్లు అతనికొక యమలోకం! తను బీదరికాన్ని బొడ్డులో పెట్టుకొని పుట్టటమే – తన మీద జనులు చూపే నిరాదరణకూ, నిర్దయకూ కనపడని కారణ మనటం సమంజసం! బాబాయ్‌కి పిల్లలు లేకపోయినా యీ పరాయి అబ్బాయిమీద అపారదయను చూపాల్సిన అగత్యం మాత్రం లేదు. వాడు బాబాయ్‌కి గుదిబండ- లేనిపోని తెగలాటకమూను!

గదిలోని కిటికీలో కూర్చొని ఆనందం తన జీవితాన్ని పర్యావలోకనం చేసుకుంటున్నాడు. ఊళ్ళోనూ, ఇంట్లోనూ కూడా తను తృణసమానుడు. పూటా రూపాయిని చూసే అసహ్యపు చూపులు తనమీద ఎల్లప్పుడూ పడుతూనే వుంటయ్. గడిచిన పద్దెనిమిది సంవత్సరాల జీవితంలోనూ – ఆ ఇంట్లో గడిపిన పుష్కరమూ తను ఒక్క 'బాధ'ను మాత్రమే అనుభవించగలిగాడు. ఇంట్లో పిండివంట చేసుకుంటే – ఆ తాలూకు వాసనకూడా తన నాశికారంధ్రాల్లో దూరేందుకు అవకాశం లేదు. బాబాయ్ ధనవంతుడైనా తనంటే మండిపడతాడు. తనవల్ల తప్పున్నా లేకున్నా- ఏదోవొక సాకు మీద రోజూ తనకు బడితెపూజ తప్పదు. తనకు మనశ్శాంతి ఎందుకుంటుంది? తన యీడు పిల్ల లందరూ ఆటపాటల్లో అమితోత్సాహంతో పాల్గొంటున్నా తనకు మాత్రం అది ఇష్టముండదు. బాబాయ్ దెబ్బలకు తన శరీరమైతే బండబారింది కాని – తన స్థితిని గూర్చి ఎంతగా తలుచుకొని బాధపడినా ఆ హృదయం మాత్రం తన కోమలత్వాన్ని వదులుకోదు. ఏమీతెలీని చిన్నతనంలో గుడ్లనీరు

కక్కుకుంటూ ఆ బాధలన్నింటినీ సహించగలిగాడు. కాని వయస్సు వస్తూన్న కొద్దీ తన హృదయం తనకే ఎదురు తిరుగుతుంది. బాబాయ్ నిద్రపోతూన్నప్పుడు- చంపేద్దామనిపిస్తుంది. కాని ధైర్యమూ చాలదు. తనమీద ఎవ్వరికీ లేని 'దయ' కూడా తనను వెనక్కు లాగుతుంది. తను బాగా చదివి పెద్ద ఉద్యోగం చేస్తూంటే బాగుండు ననిపించేది. కాని చదువు తలకెక్కదు. అసలు ఇంటి పనులతోనే తన కాలంసరి. జీతం తీసుకుంటూన్న నౌకరైనా చేసేందుకు సంశయించే పనుల్ని ఆత్మాభిమానం చంపుకొని తను అనేకసార్లు చేశాడు. ఎంత చేసినా బాబాయ్‌కి తృప్తి ఉండదు. బాబాయ్ తీక్షణ వీక్షణాలకు తను పెంపుడు కుక్కకన్నా హీనంగా మారిపోయి, ఆయన సుగ్రీవాజ్ఞల్ని అవశ్యం శిరసావహిస్తాడు. ఒంటరిగా కూర్చొని యీ ఖైదులోంచి బైటపడే మార్గంకోసం అనేకసార్లు అన్వేషించాడు. కాని తన చేతకానితనం కూడా తననే బాధించింది.

తన క్లాసులోకూడా తన కొక విరోధి వున్నాడు. ఆ రామనాథంగాడు తనను ఎందుకు ద్వేషిస్తాడో మాత్రం తెలీదు. తను వాడికి ఎంత దూరంగావున్నా- వాడు పిల్లి మీదా ఎలుకమీదా పెట్టి తనను నిష్కారణంగా తిడతాడు. ఇంట్లో ఇల్లాంటి బాధల్ని సహించేందుకు ఎంత అలవాటు పడ్డా- బైట తన యీడు కుర్రాడే తనను ఆడిపొయ్యటాన్ని సహించటం నానాటికీ అతీతమయిపోతోంది. తన లోకువను చేతకానితనం కింద జమకట్టి రామనాథం దాదాపు తనను కొట్టేవరకూ కూడా వచ్చాడు. నిజానికి తను శత్రువుకన్నా బలవంతుడు... ఒక పరిస్థితిలో రామనాథానికి దేహశుద్ధి చేయవలసిన అవసరం కూడా కలగటం వల్ల- తన బాహుబల ప్రదర్శన వాడి శరీరం మీద చూపాల్సి వచ్చింది. ఇదయ్యాక తనకు రామనాథంవల్ల ప్రమాదమేమీ సంభవించదని ఆనందం అపోహపడ్డాడు. రామనాథం తన పగను తనే తీర్చుకోలేక, బాబాయ్‌గారి ద్వారా తను తిన్న దెబ్బలకు వడ్డీ అసలు ఫాయిదాలు కూడా కలిసి ముట్టేట్టు చేశాడు... కలయింటి బిడ్డతో కొనితెచ్చుకున్న పై నేరానికి బాబాయ్ తన నిర్దోషత్వాన్ని చూడకుండానే శిక్ష విధించాడు.

ఇంటిదగ్గరా ఇదే ఆలోచన... క్లాసులో కూడా ఇదే ధ్యాస. ఇదంతా తల్చుకుంటే భోరున ఏడవాలనిపిస్తుంది. ఏవరేమన్నా చెప్పుకింద తేలులాగ పడివుండటానికే తను జన్మించినట్టు స్ఫురిస్తుంది. సంతోషంలేని తన బతుకే నిష్ప్రయోజనం: తల్లీ తండ్రీ బతికివుంటే తనకు సానుభూతైనా చూపేవారు! రామనాథం తనను చూసి ఎగతాళిగా నవ్వుకుంటున్నాడు- ఎవరు లెక్క పెడతారు తనను?... మనస్సు పాడైంది. క్లాసులో కూర్చో బుద్ధి పుట్టలేదు. పాఠం బోధపడదు- తల తిరుగుతూన్నట్టుంది.

మాష్టారు మాత్రం గ్రామఫోను ప్లేటులాగా ఏమిటో చెప్తున్నాడు. ఆనందం లేచి నిలబడి రెండడుగులు వేశాడు.

"ఎక్కడికిరా?" వెనుకనుంచి మాస్టరు అరిచాడు.

"ఇంటికి-"

"వీల్లేదు.... కూర్చో!"

"పని వుంది."

"వెళ్లావా... ఇంక క్లాసులో అడుగుపెట్టే యోగ్యతే వుండదు..."

ఒక క్షణం ఆలోచించాడు. తనను అందరూ బెదిరించి భయపెడతారు... తను బెదరబట్టేగా వాళ్ళు ఆ పని చెయ్యగలుగుతోంది? తను ఎదురు తిరిగి చూస్తే?... అంతకన్న ఇంకేం మిగిలింది తనకు?

తలవూపి చరచరా నడిచిపొయ్యాడు... వీడి మొండి ధైర్యానికి మాస్టరు నిశ్శబ్దంగా ఆశ్చర్యపొయ్యాడు.

## 2

కాలుకాలిన పిల్లిలాగు ఊరంతా తిరగటమే ఆ సాయింత్రం వరకూ ఆనందం దినచర్య, ఎక్కడా కూర్చో బుద్ధి పుట్టదు... విషయాలు తల్చుకున్న కొద్దీ ఉష్ణవాయువులు శరీరమంతా ఆక్రమించి... పిచ్చెక్కేట్టు చేస్తాయ్.

నడుస్తూ నడుస్తూ- దారికి అడ్డంగా పడుకున్న సోమరి కుక్క తోకను చూడకుండా తొక్కాడు, అది 'కయ్' మంటూ లేచి కరవబోయింది. ఎల్లాగో తప్పించుకున్నాడు. వీధిలో పారేసిన ఎంగిలి మెతుకుల్తో శరీరాన్ని పెంచుకున్న వెధవకుక్క పాటి పౌరుషం తనలోవుంటే...? మళ్ళీ తను దానిజోలికి వెళ్తే దాని పళ్ళకొసలు తన కండరాల్ని చూసి రాగలవు! ఎదురు తిరగలేనన్నాళ్లూ తన జీవితం కుక్క జీవితంకన్న క్షీణదశలోనే ఉంటుంది.

ఆలోచిస్తూ ఊరిబైటి మామిడితోపు దాకా వెళ్ళాడు... పండిన పళ్ళు మాకోసం ఎవ్వరూ రారేం? అన్నట్టు గుత్తులు గుత్తులుగా తొంగి చూస్తున్నాయ్. ఆ పళ్ళను చూసి ఆనందం ఆకలిలేచి కూర్చుంది. నాలిక పెదవుల్ని తడి చేసింది. ఎట్లా తీరుతుంది తన కోర్కె! చూశాడు... కనుచూపు మేరలో ఎవ్వరూ లేరు. ఇప్పుడు సాహసించలేకపోతే - తను ఇంకెప్పుడు సాహసించగలడు! ధైర్యంచేసి చెట్టెక్కి ఒక్కొక్క పండునే తినసాగాడు. ఆ రసం మోతాదు ఎక్కువౌతున్న కొద్దీ తన ధైర్యం క్షణక్షణం ప్రవర్ధమాన మౌతూనే వుంది. డజను పళ్ళకు పైగా పొట్టను పెట్టుకొని- పెద్దగా తేపి చెట్టుమీంచి ఒక్కసారి దూకాడు- తనకు పదిగజాల దూరంలో తను విసర్జించిన మామిడి టెంకల్ని సానుభూతితో చూస్తున్న పదహారేళ్ళ కుర్రాడొకడు చేతులోని దుడ్డుకర్రకు ఆనుకొని - మొఖం చిట్లించి తనవయిపు పరామర్శగా చూస్తూ, "ఏంటయ్యా అది?" అన్నాడు.

కుర్రవాడి తీక్షణ వీక్షణాలూ, దుడ్డుకర్ర కూడా ఆనందాన్ని భయపెట్ట లేకపొయ్యాయ్-

“ఎవడి సొమ్మనుకున్నావ్–?” అన్నాడు కుర్రాడు.

“అరేయ్ – పిచ్చిగా మాట్లాడబోక – ఈ పదమూడు టెంకలూ వున్నయ్యే– వీటిని పాతి జాగర్తగా నీళ్ళోసి పెంచు. పదమూడు చెట్లవుతయ్. అప్పుడు ఎన్ని పళ్లొస్తాయ్యో తెలుసా? నీకు నష్టమేమీ వుండదు...”

కుర్రాడికి యీ హాస్యంతో ఒళ్ళుమండి కర్రెత్తాడు. తను ఇంకా ఆలోచిస్తే తాగిన మామిడి రసమంతా కక్కేదాకా వదలడు– తిరగబడ్డాడు... వాడి చేతులోని ఆయుధాన్ని లాగెయ్యటం తనకు కష్టమనిపించలేదు.

“మా అయ్యను పిలుస్తానుండు–” అంటున్నాడు కుర్రాడు. ఆనందం మాత్రం తన బలాన్ని ఇప్పటిదాకా తెలుసుకోనే లేదు.

“బాబును పిలు – తాతను పిలు – జాగర్త–” అని కర్ర అక్కడే విసిరిపారేసి ఒక్క ఎగురు ఎగిరి ఆనందం బైటపడ్డాడు.

పక్షులు గూళ్ళను జేరుతున్నాయ్ – వాటిని అడ్డుపెట్టే దెవరు? పక్షులకున్నంత మాత్రం స్వాతంత్ర్యం తనకు లేదాయె! తను కూడా పక్షుల్లాగే ఒంటరిగా విశాల విశ్వంలోకి దూకుతే–? కాని పక్షులకు వాటి ఆహారాన్ని సంపాయించుకొనే విధానం తెలుసు. తనకు అది తెలీదు; తెలిసినా సఫలమయ్యే అవకాశమూ లేదు. తను యీ ఊరు వదిలి వెళ్ళటమే తనకు కావాలి – ఆ జైలు జీవితంలోంచి విముక్తి చెందుతే చాలు.

వరి చేలల్లో నడుస్తూంటే ఒక యువతి గంప నెత్తిన పెట్టుకొని తనకు ఎదురైంది. కూతవేటు దూరంలో ఎవ్వరూ లేరు. కొంటెగా అతను అన్నాడు ‘ఒసేయ్–’ అని. ఆమె తీక్షణంగా చూస్తూ, ‘ఎవడ్రా నువ్వు–?’ అంది. తను ఆమెకన్న బలవంతుడని తెలిసినా ఆమె ఊరుకోలేదు–

“నేను హనుమంతుణ్ణి – నువ్వు లంకిణివీను–”

ఆమె స్తబ్ధ అయి చూస్తోంది. అతను వెళ్ళి ఆమె కళ్ళల్లోకి కొంటెగా చూస్తూ నవ్వి– “ఇంటిదారి పట్టవే భామా!” అని రాగాలు తీశాడు.

ఆమె మాట్లాడకుండా సాగిపోయింది.

ఆనందం తనలో తను నవ్వుకున్నాడు.

## 3

అర్ధరాత్రి ఇంటికి రావటం ఆనందానికి ఇదే మొదటిసారి. ఇంతవరకూ బాబాయ్ వీడిరాక కోసం ఎదురుచూస్తూనే ఉన్నాడు. కాలయాపన జరిగినకొద్దీ ఆయన కోపం అధికమౌతోంది. దాంతోపాటు ఆనందానికి విధించాల్సిన దెబ్బల మొత్తం కూడా ఆయన ఊహా ప్రపంచంలో పెరుగుతూనే వుంది.

తనకు తను ఎంత ధైర్యం చెప్పుకుంటున్నా ఆనందానికి ఇల్లు సమీపిస్తున్న కొద్దీ భయం అధిక మవసాగింది. అడుగుల్లో అడుగులు వేసుకుంటూ లోన ప్రవేశిస్తున్నాడు.

"అరేయ్!" వెనుక నుంచి గర్జన.

ఉగ్రమూర్తి బాబాయ్‌ని, ఆయన చేతిలోని దుడ్డుకర్రనూ చూసేప్పటికి వాడి అల్పప్రాణం ఆవటిల్లింది.

"ఇవ్వాళ స్కూల్లోంచి పారిపొయ్యావట్రా?"

తనకు తెలీకుండానే ఆనందం తల తిప్పాడు.

"తెగమేసి- వెధవా!-"

మాటలకు మారుగా ఆనందం శరీరం మీద దెబ్బలు పడుతున్నాయ్.

ఒకటి- రెండు- మూడు ఆగవు అవ్వి! బాధ! ఇన్నాళ్ళూ అనుభవించినంత బాధా- యీ ఒక్కరాత్రికీ అతనికి శిక్షగా స్ఫురిస్తోంది. వాడి ఉష్ణరక్తం పొంగి పొరలుతోంది. 'దద్దమ్మా' అని తిడుతోంది హృదయం! 'ఎన్నాళ్ళయినా నీ గతి ఇంతే" అంటోంది అంతర్వాణి.

ఎదురుతిరుగుతే? బాబాయ్‌కే: కాని దెబ్బలు!

"బా-బాయ్?" యజ్ఞవేదిక మీదికి తీసుకుపోబడుతూన్న జంతువు కంఠమది!

సమాధానం లేదు; 'దయ' అరికట్టలేని ప్రవాహమది. బాబాయ్ ముసలిచేతి బలాన్ని ఊతగా తీసుకొని - పెద్ద సముద్ర కెరటంలాగు ఉరకబోతుంది. ఆ కర్ర... అప్రయత్నంగా చెయ్యి అడ్డుపెట్టినా - అరచేతికి కర్రవిసురు తగిలింది. వెంటనే కర్రను పట్టుకొని గుంజాడు. బాబాయ్ చేతిలోని కర్ర అతని చేతుల్లోకి వచ్చింది.

"తే-అదిట్లా?" బాబాయ్ ఉరిమాడు.

ఇస్తే తనకు ప్రాణాలమీద ఆశ వుండదు. ప్రాణగండం నాడయినా వ్యక్తిత్వాన్ని బయలుపర్చవలసిన బాధ్యత తనకు వుంది. తన యీడు తోటమాలి కుర్రాడికన్నా, రామనాధంగాడికన్నా - బాబాయ్ బలవంతుడు కాడు... మీది కొస్తూన్న బాబాయ్‌ని ఒక్క నెట్టు నెట్టాడు - బాబాయ్ కిందపడ్డాడు... కాని, లేచాడా తనను బతకనివ్వడు! ఆయుధం తన చేతిలోవుంది. కాని బాబాయ్ అరుస్తే...

సరిగ్గా బాబాయ్ బుర్రమీదికి కర్ర ఎత్తాడు. శ్వాస కూడా గట్టిగా పీల్చకుండా బాబాయ్ ఏకదీక్షతో కర్రవైపు దీనంగా చూస్తున్నాడు.

"అరిచావా కపాల మోక్షమే!"

ఇన్ని దెబ్బలు ఓర్చుకొని అమిత అణుకువతో వున్న చిన్న వెధవేనా తనకు ఎదురుతిరిగింది? బాబాయ్ కోపం మితిలేకుండా పెరిగింది. కాని వెళ్ళకక్కే సమయం మాత్రం కాదు. జాలిగా కర్రవైపు 'నన్నెందుకు చంపుతావు?' అన్నట్టు చూడసాగాడు.

ఆనందానికి మొండిధైర్యం వచ్చింది. ఈ సమయం మించుతే మాత్రం తను మామూలు సేవకుడే! జీవితాన్ని నిర్ణయించే విలువైన క్షణాలివ్వి!

బిగ్గరగా నవ్వి ఆనందం అన్నాడు: "నీ పాదాల దగ్గర పడివున్నాననేగా నన్ను చిత్రవధ చెయ్యటం? ఈ దిక్కులేని పక్షి మీద నీకు జాలీ, దయా వుందా? నీ పెంపుడుకుక్కకు ఉన్నంత విలువలేదూ?... కాని ఇప్పుడు నేను అన్నింటికీ తెగించాను. ప్రతీదీ నిర్ణయం చేసుకోదల్చుకున్నాను. ప్రపంచంలోకి వెళ్ళిపోయి నా గతి నేను చూసుకుంటాను..."

వాడు తనకు హాని చెయ్యకుండా వదలటమే తన లక్ష తప్పుల్ని కాచినట్లని సంతోషపడుతూ బాబాయ్. "పో ఎవరొద్దన్నారు?" అని ఎన్నడూలేని ఆపేక్షను వ్యక్తపరిచాడు.

"పోతా– కానీ, నాకు డబ్బుకావాలి... తియ్... ఆ ఇనప్పెట్టె తీసి ఐదొందలివ్వు..." డబ్బుమాటవిని బాబాయ్ రెండు క్షణాలు కదలేదు; మెదల్లేదు.

"డబ్బా? నా దగ్గర లేదు–"

"నీకు బతకాలని వుంటే నాకు డబ్బివ్వు–" ఆనందం ఆకారం దండాన్ని ధరించిన యముణ్ని జ్ఞాపకం చేస్తోంది. ఇంక ఏమిటి తనకు దారి?

"తేల్చుకో త్వరగా – ఈ క్రర ఒక్క విసరుతోనే నిన్ను యి లోకంలోంచి విసిరెయ్యగలదు–" బాబాయ్ మాట్లాడలేదు. గుడ్లు మిటకరిస్తున్నాడు.

"కానీ – త్వరగా" కర్ర సగం దిగింది. కొద్దిదూరంలోనే తన చావుబతుకుల పొలిమేర వుంది. మృత్యుదేవత యీ ధనబలిని కోరుతుందని అతనెప్పుడు అనుకోలేదు– తన ప్రాణాలకు ఇంత విలువను పెట్టిన దేవుడు దూషణార్హుడే!

"ఏమంటావ్–"

"ఇస్తాను... తొందర పడబోక..."

బాబాయ్ ఇనప్పెట్టెలో ఐదొందల రూపాయిల కరెన్సీ నోట్లు ఖాళీ!

ఆనందం వికటంగా నవ్వాడు.

"చాలు– నేను వెళ్ళుతున్నా–" అని కర్ర విసిరిపారేసి ఒక్క దూకుతో ఇంటి ఆవరణం దాటి ఆ చీకటి సముద్రంలో మాయమయ్యాడు.

– *ఫిబ్రవరి, 1942*